# ఓ తండ్రి కథ

రంగారావుకి రవ్వంత కూడా మనశ్శాంతి వుండటంలేదు. కూతురి పెళ్లి చేశామన్న తృప్తీ లేదు. అలాగని ఇన్నేళ్ళు తమ వద్ద వున్న కూతురు అత్తవారింటికి వెళ్ళిపోయిందన్న దిగులూ లేదు.

అయినవాళ్ళూ, ఆత్మీయులు మాటల సందర్భంలో "ఇంకా మీకు దిగులేముందండి. అమ్మాయి పెళ్లి చేసేశారు. సొంత యిల్లు వున్నది. నెలనెలా వచ్చే అద్దె. పింఛను డబ్బుతో మీ భార్యాభర్తలకు గడవక పోదు. అబ్బాయికి వుద్యోగం వచ్చింది కూడా. ఇక మగపిల్లవాడి పెళ్ళి గురించి ఆదుర్దా పడాల్సిన పనేముంది గనక" అని అనటం రంగారావుగారికి నవ్వు తెప్పిస్తుంది.

ఆడపిల్ల పెళ్లి చేసిన తండ్రిని ఓ గొప్ప ఘనకార్యం చేసిన వాడిలా పొగడటం, ఇక జీవితంలో దిగులు పడాల్సిన అవసరం ఏదీ లేదంటూ తేల్చి చెప్పేయటం ఆయనకు ఎంత ఆలోచించినా అర్థం అయ్యేది కాదు.

"అమ్మాయిపెళ్ళి ముందునుంచి గమనిస్తున్నాను. మీరేమిటో ఆలోచిస్తూ మీలో మీరే దిగులుపడుతున్నారు. ఇన్నాళ్లు కాపురం

చేశాం మనసులోమాట ఏమిటో నాకూ చెప్పొచ్చుగా"కొంతనిష్ఠూరం మరికొంత దిగులు మేళవించి అన్నది భార్య సుగుణమ్మ.

'అవున్నిజమే. ఆమెతో చెప్తే తప్పేముంది. పైగా మనసులో వేదన ఇతర్లతో చెప్పుకుంటే కొంత మనశ్శాంతికూడా పొందవచ్చంటారు' అనుకున్నారు రంగారావుగారు.

'మనసులోని ఆవేదనంతా ఆమెకు చెప్పేస్తే... ఆవిడెలాఅర్థం చేసుకుంటుందో, నన్ను ఇదివరకులా ప్రేమిస్తుందా, ఆదరిస్తుందా' సందేహం కలిగిం దాయనకు.

తను చేసిన వన్నీ తప్పో, ఒప్పో జరిగిపోయాయ్. కాని వాటి నలా రహస్యంగా తనలోనే దాచుకుని అంతర్మథన పడటం ఆమె గ్రహించింది. ఇప్పుడుకూడా చెప్పకపోతే ఆమె మనసు మరింతబాధ పడుతుంది. అందుకే ఏది ఎలా జరిగినా తన ఆవేదనంతా అర్ధాంగికి చెప్పటానికే నిర్ణయించుకున్నారు రంగారావుగారు.

బంధువుల ఇంటికి పేరంటానికి వెళ్ళిన భార్య రాక కోసం ఎదురుచూస్తూ వాలుకుర్చీలో పడుకున్నారాయన. సంతోషాన్నయినా విచారాన్నయినా కావలసిన వ్యక్తులతో పంచుకుంటేనే తృప్తి. వాటి విలువకూడా అలా పంచుకోవటంతోనే పెంచుకోవచ్చు కూడా.

అలా ఆవిడకోసం ఎదురుచూస్తున్న రంగారావుగారి మనసులో మెరుపులా ఓ ఆలోచన.

'చెప్పాలనుకున్న విషయాలన్నీ ఆమెకు ఎదురుగా కూర్చుని చెప్పటం కష్టమేమో. పైగా విషయాలన్నీ వివరంగా విశదీకరించ

లేనేమో' అందుకే తన మనోభావా లన్నింటికీ అక్షరరూపం యివ్వ దలిచా డాయన.

వెంటనే కాగితం కలం పట్టుకొచ్చుకున్నాడు లోపలికెళ్ళి.

డాబా మీదకు వెళ్ళి తన అంతరంగ తరంగాలతో వాక్య నిర్మాణం ప్రారంభించాడు రంగారావుగారు. ఉవ్వెత్తున ఎగిరిపడు తున్న ఆలోచనావేశాలను ఉపశమింప జేసుకుంటూ వ్రాయసాగా డాయన.

సుగుణా!

ఇలా సంబోధిస్తూ నీకు ఎన్నో వుత్తరాలు వ్రాశాను మన పెళ్ళికి ముందు, తర్వాత కూడా కొంత కాలం. పెళ్ళికిముందు మనం వ్రాసుకున్న ఆ వుత్తరాలన్నీ ఇంకా నాదగ్గర వున్న విషయం నీకూ తెలిసిందే. ఎప్పుడైనా మనసు బాగుండక పోతే వాటిని ముందేసుకు కూర్చుంటానన్నది నీవు ఎరిగిన విషయమే.

మన అబ్బాయి పుట్టినప్పుడు కాబోలు మీ నాన్న నాకువ్రాసిన ఉత్తరానికి బదులుగా ఆయనకు ఒకటి, నీక్కూడా వేరుగా ఓవుత్తరం వ్రాశాను. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ అదే నేను నీకు చివరి సారిగా వ్రాసిన ఉత్తరం. అటు తర్వాత నీకు ఉత్తరం వ్రాయాల్సిన అవసరం కలగలేదు.

ఇప్పుడు... ఇన్ని సంవత్సరాల తర్వాత నీకు ఉత్తరం వ్రాస్తు న్నాను. ఇన్నేళ్ళ మన సంసారంలో ఎన్ని సంతోషకరమైన సంఘ టనలు జరిగినయ్యో, ఎన్ని కష్టాలు ఎదురైనవో నీకూ తెలుసు. నిన్నెంతవరకు సుఖపెట్టానో చెప్పవలసింది నీవు. చాలీచాలని నా

ఆదాయంతో నీ కోర్కెలు ఎన్నింటిని చంపుకున్నావో నీవు పెదవి విప్పి చెప్పకపోయినా నాకు తెలుసు. నా సంతోషం కోసం. నా తృప్తి కోసం నీ అయిష్టాల నెన్నింటినో ఇష్టంగానూ, మరెన్నో ఇష్టాలను అయిష్టంగానూ మార్చుకున్నావు.

ఎప్పటి కప్పుడు ఈ ఆలోచనలను, బాధలను నీ చల్లని చిరు నవ్వుతోనూ, నీ ఆప్యాయతతోనూ మరచిపోవటం నాకు అంతకష్టం అనిపించలేదు. పిల్లలు పుట్టాక మన ఇద్దరి ఆలోచనా వారిపైనే వుండటం ప్రారంభం అయింది.

తల్లిదండ్రులిద్దరికీ పిల్లలమీద ప్రేమ ఒకస్థాయిలో వుండటం నిజమే అయినా పిల్లలకు మాత్రం తల్లంటే ప్రత్యేక స్థానం, ఎక్కువ చనువు వుంటటం కూడా అంత నిజం.

"మీరు పిల్లల పట్ల మరీ కఠినంగా వుంటున్నారు" అని నీవు ఎన్నోసార్లు అనేదానివి. నీవు అలా అన్న ప్రతిసారి ముక్తసరిగా, ముభావంగా వుండేవాడిన్నేను.

ముఖ్యంగా ఈ వుత్తరంలో నేను వ్రాయ దలుచుకున్న విష యం మన అమ్మాయి కమల గురించి, ఇక ఆ విషయం ప్రారంభిస్తాను.

నీకు గుర్తుండే వుంటుంది. కమల పసి వయసులో నన్ను రక రకాల కోరికలు కోరుతుండేది. నిన్ను అది ఏమడిగినా 'నాన్నగారిని అడుగు' అంటూ నా దగ్గరకు పంపి ముసిముసిగా నవ్వుకునే దానివి.

అది నను ఏది అడిగినా "అలాగే కొందాం" అని ఓ తియ్యని అబద్ధం చెప్పి మరిపించేవాడిని. తెలిసీ తెలియని వయసులో పిల్లలు

ఏవేవో అడిగినప్పుడు సహజంగా ఏ తల్లిదండ్రుడు లయినా అలాగే చెప్తుంటారు కదా. అందుకే నేను దాన్తో అలా అబద్ధాలు చెప్పి నందుకు ఎప్పుడూ విచారించలేదు. నేను "సరే" అన్నప్పుడల్లా ఆ పసి ముఖంలో కనిపించే ఆనందం ఇప్పటికీ నా కళ్ళముందు కద లాడుతుంటుంది. అదే సమయంలో నా ఆర్థిక స్థోమత నన్ను వికృ తంగా వెక్కిరిస్తూ వుంటుంది.

మనం ఎన్నోసార్లు పాపను తీసుకుని బట్టలకొట్టుకు వెళ్ళి వుంటాము అక్కడ దానికి నచ్చిన వాటిని చూపుతూ అవి కొన మని మారాం చేసేది. అవన్నీ పిచ్చివంటూ ఇద్దరం మభ్యపెట్టే వాళ్ళం. అప్పటికి వినకపోతే విసుక్కునే వాళ్ళం. ఆ పసిదానిపైన విరుచుకుపడే వాళ్ళం. కొన్నాళ్ళు అలా మనతో విసిగిపోయిన ఆ చిన్నారి మనసులో ఎన్ని భావాలు కలిగినయ్యో కాని అటుపై ఎటు వంటి పేచీ పెట్టనట్లే నాకు గుర్తు.

అమ్మాయి పెద్దదయింది. స్కూలు చదువు పూర్తిచేసింది. పదో తరగతి ఫస్టు క్లాసుతో పాసయిందని మనం ఎంతగానో సంతోషించాం.

"నేను సైన్సుగ్రూపే చదవాలి" అని అది ఎంత పట్టుదల చూపిందో కదూ.

ఆగ్రూపు ఖర్చుతో కూడుకున్నదని అంతశక్తి నాకు లేదని ఆ లేతమనసుకు చెప్పి నొప్పించటం నాకు చేతకాలేదు. చెప్పటం చేదకాలేదు కాని చేతల్తో చేసిచూపిన అభాగ్యుడ్ని నేను ఈ నిజం నీకూ ఇంతవరకు చెప్పనందుకు క్షమించు.

మనసు చంపుకుని రెండు మూడుసార్లు అమ్మాయి మనసు మార్చటానికి ప్రయత్నించాను. వేరే గ్రూపు చదవమని ప్రోత్సహించాను. కానీ ఆ చిన్నారి మనసులోని బలీయమైన కోరిక నామాటల్ని ఖాతరు చేయనీయలేదు. మొదటి సారిగా నాతో పౌరుషంగానూ, పరుషంగా కూడా మాట్లాడింది.

ఇక దాన్ని ఒప్పింటం కష్టమైన పని అనుకున్నాను. అందుకే కాలేజి ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళి నా గోడు వెళ్ళబోసుకున్నాను. నా బాధను అర్ధం చేసుకోమన్నాను. కష్టసుఖాలు తెలిసిన మనిషికాబోలు నన్ను తిట్టకుండా మౌనంగా తలాడించాడు నా అభీష్టానికి అంగీకార సూచనగా.

ఫలితంగా అమ్మాయికి సైన్సు గ్రూపులో సీట్లు అయిపోయిన వని, ఇంకా ఆలస్యం అయితే మిగతా గ్రూపుల్లో కూడా సీట్లుండవని చెప్పటం జరిగింది. ఆయనలా చెప్పడనే కంటే నేను చెప్పించా నంటే నిజం నిర్భయంగా నీ ముందు చెప్పినట్లు వుంటుంది. కాలేజి చదువుకే ముప్పు వాటిల్లుతుందనే భయం వలన కాబోలు అయిష్టం గానే ఆ గ్రూపులో చేరటానికి అంగీకరించింది కమల.

కొత్తగా కాలేజి చదువు ప్రారంభించానన్న ఆనందం ఆ పిల్ల మొఖంలో వెతికినా కనిపించలేదు నాకు. యాంత్రింగా అలా కాలేజికి వెళ్లి, వచ్చేదాన్ని చూసినప్పుడల్లా నా మనసు విలవిల్లాడి పోయేది. నా జీవితంమీద నాకే అసహ్యం వేసేది.

చదువు మీదున్న శ్రద్ధతో, సహజంగా వున్న తెలివితేటల్తో అది చదువులో బాగానే రాణించింది. అంత తెలివైన పిల్లను, తను

కోరిన చదువు చెప్పించలేకపోయిన నిర్భాగ్యపు తండ్రిని నేను. విచక్షణారహితంగా దాని కోరికను మొదలంటా నరికివేశాను.

పెద్దగీత ముందు చిన్నగీత అన్నట్లు అప్పట్లో ఆ విషయానికి ఎంతో సిగ్గుపడిన నేను, ఇప్పుడు ఆలోచిస్తే అది చాలా మామూలు విషయంగా అనిపిస్తుంది.

మొన్న కాకినాడ సంబంధం వారు, హైద్రాబాదు వారు వచ్చి పెండ్లిచూపులు చూసి వెళ్లారు కదా సుగుణా. ఆ ఇద్దరికి అమ్మాయి నచ్చిందట. ఈ విషయం తెలియగానే ఆశ్చర్యపోతున్నావు కదూ ! నిజమే. మన అమ్మాయి వారిరువురికి నచ్చింది.

అమ్మాయి కాకినాడ సంబంధం అంటే ఎక్కువ ఇష్టపడుతున్నట్లు చెప్పేవు. అందం, ఆస్థి విషయంలోనూ, ఉద్యోగం, హెూదా విషయంలోనూ అతన్ని కోరుకుంది కమల. ఈ విషయం ఆమె మనకు సూటిగా చెప్పకపోయినా, నీ తల్లి మనసు గ్రహించి ఈ నిర్భాగ్యపు తండ్రికి వివరించింది. ఇద్దరి అభిప్రాయాలు సేకరించాను.

కాకినాడ వారు అడిగిన కట్నం, కోరిన లాంఛనాలు నాస్తోమతకు మించిపోయినై. నేను వారితో సరితూగలేనేమో ననిపించింది. మరికొంత అప్పు చేసయినా సరే పిల్లని వారికే ఇచ్చేద్దామంటే పెళ్ళి అయ్యాక కూడా వారికోరికలు వగైరాలు నాకు భయంకలిగించినై.

నా స్తోమతకు, నా శక్తికి తగినట్లుగా అనిపించిన హైదరాబాద్ సంబంధం ఖాయం చేసుకుని వచ్చాను.

'కాకినాడ వారికి నీవు నచ్చలేదుటమ్మా' అని చెప్పకూడని అబద్ధం చెప్పేను. పిచ్చితల్లి ఈ మాటకు ఎంత బాధపడిందో. నా

బంగారుతల్లి నచ్చకపోవటమా. ఆ మాట నా నోటితో నేను ఆ చిట్టి తల్లితో అనడమా... కానీ అనేశాను సుగుణా. ఆమె సున్నిత మయిన మనసు ఎంత గాయపడుతుందో ఆలోచించకుండా అనేశాను.

అంతే కాదు. అల్లుడ్ని గురించిన వివరాలు కనుక్కున్నమాట నిజమే అయినా, అతను అన్నిరకాలుగా యోగ్యుడని తెలుసుకున్న మాట కూడా నిజమే అయినా మరిన్ని జోడించి అతన్ని గురించి గొప్పగా చెప్పి అమ్మాయిని ఉత్సాహపరిచాను.

నా మాటలకు ఉప్పొంగిపోలేదు. కృంగిపోలేదు. బహుశా 'ఈ నాన్న యింతే, నేనడిగినవి ఎప్పుడు సమకూర్చాడు కనుక' అను కున్నదేమో పిచ్చితల్లి మౌనంగా తలాడించి తన అంగీకారం తెలి పింది. పసివయసు నుంచి పెళ్ళి వగకు తను కోరింది ఏ ఒక్కటీ సమకూర్చలేక పోయాను. మిగిలిన విషయా లన్నింటికి ఎలాగో రాజీపడి నా మనసును నేనే సమాధాన పరుచుకున్నా కనీసం పెళ్ళి విషయంలోనైనా అమ్మాయి కోరిక తీర్చగలిగి ఉంటే ఇంత మాన సిక క్షోభ వుండేది కాదేమో నాకు. కాని వారి ఆలోచనా విధానం అంతా ఆర్థిక పరమైన లావాదేవీలతో ముడిపడి వుండటం గ్రహిం చిన నేను ధైర్యం చేయలేక పోయాను.

నిజానికి ఈ విషయా లేవీ అమ్మాయికి తెలియవు. దాన్ని అడుగడుగునా మోసం చేశానన్న బాధ నన్ను కృంగదీస్తున్నది.

నా బాధని, ఇబ్బందిని నీవు అర్థం చేసుకుని క్షమిస్తావని ఆశిస్తున్నాను.

ఉత్తరం వ్రాయటం పూర్తి చేసి డాబా పైనుంచి కిందికి వచ్చాడు రంగారావుగారు.